## క్లుప్తంగా

### ఇఫ్తార్ విందులో ఎస్వీ



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు (టౌన్): మానవాళి మనుగడ కోసమే ముస్లింలు ఉపవాసదీక్షలు చేస్తారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ నగర అధ్యక్షుడు పత్తా బాషా, ముస్లింల ఆహ్వానం మేరకు నగరంలోని లాల్ మసీద్ వద్ద ఉన్న కూబ్ సూరత్ బడే సాహెబ్ మసీద్‌లో ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. 10వ వార్డు కార్పొరేటర్ షేక్ యూనుస్ బాషా, షేక్షావలి, బాలు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

### డీఎస్సీ నోటిఫికేషన్ కోసం 17న ధర్నా




మాట్లాడుతున్న కె.శ్రీనివాసులు

కర్నూలు(సెంట్రల్): డీఎస్సీ నోటిఫికేషన్, నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరుతూ మార్చి 17న కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పిన కూటమి నాయకులు తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. సీఎం చంద్రబాబునాయుడు మొదటి సంతకం చేసినా ఇంతవరకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కాకపోవడం అన్యాయమన్నారు. మరో వైపు నిరుద్యోగ భృతికి బడ్జెట్‌లో నిధులుకేటాయించకపోవడాన్ని నిరసిస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. నాయకులు నాగరాజు, బీసన్న పాల్గొన్నారు.

### రేషనలైజేషన్‌తో వీఆర్వోలకు అన్యాయం



మాట్లాడుతున్న మౌలిబాషా

కర్నూలు(సెంట్రల్): గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్‌తో వీఆర్వోలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, జిల్లా అధ్యక్షుడు మౌలిబాషా ఆవేదన వ్యక్తంచేశారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ విధానం కసరత్తుపై అధికారుల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోవాలని కోరారు. రూరల్ మండలాల్లో ఎంపీడీఓలు, అర్బన్ ప్రాంతాల్లో మునిసిపల్ కమిషనర్ల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని క్లస్టర్లను మ్యాపింగ్ చేయడం అన్యాయమన్నారు. కోశాధికారి శ్రీధర్, ఉపాధ్యక్షుడు బుద్ధకవి, నర్సరాజు పాల్గొన్నారు.

### క్రీడా సామగ్రి పంపిణీ



స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి భరత్

కర్నూలు (టౌన్): తైక్వాండో క్రీడాకారులకు మంత్రి టీజీ భరత్ శుక్రవారం తన నివాసంలో స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ మాట్లాడుతూ.. నగరంలో తైక్వాండో క్రీడకు మంచి ఆదరణ ఉందన్నారు. క్రీడాభివృద్ధికి సహకారం అందిస్తానన్నారు. తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### 30 నుంచి ధార్మిక ప్రసంగం

కర్నూలు కల్చరల్: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళిలో ఉగాది, శ్రీ సీతారాముల కల్యాణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి తెలిపారు. 30వ తేదీన ఉగాది, ఏప్రిల్ 6న శ్రీరామనవమి పురస్కరించుకొని శ్రీ సీతారాములు కల్యాణోత్సవంను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 30 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు 'శ్రీమద్రామాయణం బాలకాండ' పై ధార్మిక ప్రసంగం ఉంటుందని వెల్లడించారు.

### కార్ల్‌మార్క్స్‌కు నివాళి

కల్లూరు: శ్రమ దోపిడీని మొదటిసారి గుర్తించిన తత్వవేత్త కార్ల్‌మార్క్స్ అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాధాకృష్ణ అన్నారు. శనివారం చెన్నమ్మ సర్కిల్‌లోని సూర్యానారాయణ భవన్‌లో కార్ల్‌మార్క్స్ వర్ధంతి సభను న్యూసిటీ కార్యదర్శి రాముడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## గుక్కెడు నీళ్లివ్వలేని దుస్థితిలో మునిసిపాలిటీ




ప్రజా చైతన్య యాత్రలో పాల్గొన్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం కర్నూలును చెప్పకుప్పలమయంగా మార్చేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ కనీసం ప్రజలకు గుక్కెడు మంచినీళ్లు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని చెప్పారు. శుక్రవారం సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా చైతన్య యాత్రను ప్రారంభించారు. ఇందులో భాగంగా సీపీఎం నాయకులు నగరంలో తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో బాగా పన్నులు కట్టే ఎస్ఆర్ పేట, కొత్తపేట లాంటి ప్రాంతాల్లో కూడా మంచినీరు రావడం లేదన్నారు. దీన్ని బట్టి చూస్తే పన్నులను కట్టించుకోవడంపై ఉన్న శ్రద్ధ ప్రజల అవసరాలను తీర్చడంలో లేదని అర్థమవుతోందన్నారు. సీఎం చంద్రబాబు ప్రజల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలపై విద్యుత్ భారం వేసి నడ్డి విరిచారన్నారు. చెత్త ఆటోలను నిలిపివేయడంతో నగరంలో ఎక్కడచూసినా పేరుకుపోయిన చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయన్నారు. ఇంటి, కుళాయి పన్నులు తగ్గించాలని కోరుతూ త్వరలోనే కార్పొరేషన్‌ను ముట్టడిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అబ్దుల్లా, రామకృష్ణ, మద్దిలేటి, మహేష్, చెన్నయ్య పాల్గొన్నారు.

## లలితా సహస్రనామ పారాయణం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కర్నూలు కల్చరల్: హోలీ పౌర్ణమి పురస్కరించుకొని ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో శుక్రవారం ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. లలితా త్రిపుర సుందరి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో అభిషేకం, అర్చనలు చేశారు. లలితా సంఘం అధ్యక్షుడు తెల్లాకుల జ్ఞానేశ్వరమ్మ ఆధ్వర్యంలో లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశమిచ్చారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

## 'విశాఖ ఉక్కు'కు గనులు కేటాయించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి సొంత గనులను కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి.రమేష్, జిల్లా కార్యదర్శి మునెప్ప, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎం.నాగన్న, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజనేయులు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేసేందుకు కుట్రలు చేస్తోందన్నారు. లాభాల్లో ఉన్న పరిశ్రమను నష్టాల్లోకి నెట్టేందుకు చూస్తోందన్నారు. పరిశ్రమ అభివృద్ధికి కేటాయించిన రూ.11,500 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అని, విశాఖ ఉక్కును పరిరక్షించుకోవడానికి పోరాటాలను ఉద్ధృతం చేస్తామన్నారు.

## శ్రీచైతన్య మహాప్రభు ఆవిర్భావ దినోత్సవం



ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులు

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో కర్నూలు భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో శుక్రవారం శ్రీ చైతన్య మహాప్రభు 539వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే గౌర పూర్ణిమ వేడుకలను పురస్కరించుకొని తెల్లవారు జామున 4.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. హరినామ జపం, గౌర హారతి, మహా శంఖాభిషేకం, 108 రాజ భోగ నివేదన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రఘు నందన సేవక్ ప్రభు గౌర లీలపై సందేశమిచ్చారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## సంస్కృత అధ్యయన కేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న సంస్కృత భారతి జిల్లా అధ్యక్షురాలు మహాలక్ష్మి

కర్నూలు కల్చరల్: న్యూఢిల్లీ కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఆ కళాశాలలో సంస్కృత అధ్యయన కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్కృత భారతి జిల్లా అధ్యక్షురాలు మహాలక్ష్మి, నేషనల్ సంస్కృత యూనివర్సిటీ ఆచార్యులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. అన్ని భాషలకు జనని అయిన సంస్కృత భాషను అందరూ నేర్చుకోవాలనే సదుద్దేశంతో కేంద్రియ సంస్కృత విశ్వవిద్యాలయం సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించిందన్నారు. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సాయంత్రం 4 గంటల నుంచి తరగతులు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 90195 56184 నంబర్‌ను సంప్రదించాలన్నారు. సంస్కృత భారతి నగర అధ్యక్షుడు గుబ్బా బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

### నిత్యావసర సరుకుల పంపిణీ

కర్నూలు కల్చరల్: కల్లూరు విశ్రాంత ఉద్యోగుల సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని నగర శివారు అభయగిరిలోని ఎయిడ్స్, లెప్రసీ బాధితులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు శ్రీరాములు, ఉపాధ్యక్షుడు చలపతి, మేడా వెంకటేశ్వర్లు, సభ్యులు మనోహర్ రావ్, శ్రీనివాసులు, ఈశ్వరయ్య, విరుపాక్షయ్య కేడీజే బాబు తదితరులు ఉన్నారు.

### ఆర్‌పీహెచ్ఎల్ సీఎస్‌బీగా ప్రభావతిదేవి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలో ఉన్న రీజనల్ పబ్లిక్ హెల్త్ ల్యాబోరేటరీ సివిల్ సర్జన్ బాక్టీరియాలజిస్టుగా డాక్టర్ ఒ.ప్రభావతిదేవిని నియమించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో అడిషనల్ డీఎంహెచ్ఓగా పనిచేస్తున్న ఆమెను ఒక సంవత్సరం డిప్యూటేషన్‌పై ఇక్కడ నియమించారు. కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో డిప్యుటేషన్‌పై రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం జిల్లా కో–ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న ఐ.హేమలత బదిలీ అయ్యారు. ఆమెను కడపలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు అగ్రికల్చర్: కర్నూలు క్యాంపస్ సెక్షన్ పరిధిలో లైన్‌ల నిర్వహణ పనులు చేపడుతున్నందున ఈ నెల 15న మధ్యాహ్నం 4 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషాద్రి తెలిపారు. శ్రీలక్ష్మీనగర్, గఫూర్ నగర్, శ్రీనగర్ కాలనీ, టెలికాం నగర్, లెక్చరర్స్ కాలనీ, కమలానగర్, తదితర ఏరియాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ఆర్టీసీ ప్రైవేటీకరణ ఆపాలి

కర్నూలు(సెంట్రల్): ఆర్టీసీల్లోకి విద్యుత్ బస్సుల పేరుతో ప్రైవేట్ పరం చేయడం మానుకోవాలని ఏపీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్, గౌరవాధ్యక్షుడు ఎండీ అంజిబాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆర్టీసీకి ప్రైవేటీకరణ విధానాలు మంచివి కావన్నారు. ఆర్టీసీ బస్సుల స్థానంలో విద్యుత్ బస్సులను తీసుకురావడం తగదన్నారు. ఆర్టీసీ వర్కర్లు, సిబ్బంది, సంస్థ సమస్యల పరిష్కారం కోసం మార్చి 24వ తేదీన నిర్వహించనున్న చలో విజయవాడను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

### 12న వీర హనుమాన్ శోభాయాత్ర

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 12న వీర హనుమాన్ విజయ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బలోపాసన దివస్ పురస్కరించుకొని హిందువులను సంఘటితం చేసేందుకు హనుమాన్ శోభాయాత్ర ఒక సువర్ణ అవకాశం అన్నారు. శోభాయాత్రలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి, వీహెచ్‌పీ దక్షిణాంధ్ర ప్రాంత విశేష సంపర్క ప్రముఖ్ ప్రతాప్‌రెడ్డి, వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి సందడి మహేష్, జిల్లా కార్యదర్శి ఈపూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: ట్రూ అప్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం నాయకుల బృందం కల్లూరు అర్బన్ ప్రాంతంలో పర్యటించి రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు యేసు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచమని అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు ట్రూఅప్ చార్జీల పేరుతో పేదలపై భారం వేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు బాదుడే బాదుడు అంటూ గగ్గోలు పెట్టిన వారు అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు ఎలా పెంచుతారన్నారు. పేదలను దోచుకునే ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో ఈశ్వర్, కోటి మధు, వెంకటేశ్, గంగాధర్, భాస్కర్, చైతన్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## కేసీ కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహం



లభ్యమైన మృతదేహం

కర్నూలు: కేసీ కెనాల్‌లో కొట్టుకుపోతున్న గుర్తు తెలియని పురుషుడి మృతదేహాన్ని పోలీసులు వెలికితీసి ప్రభుత్వాసుపత్రి మార్చురీ కేంద్రంలో భద్రపరిచారు. శుక్రవారం మధ్యాహ్నం కర్నూలు వైపు నుంచి నీటిలో కిందివైపు కొట్టుకుపోతుండగా జొహరాపురం బ్రిడ్జి వద్ద స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఒకటో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని నీటిలో నుంచి బయటికి తీసి మార్చురీకి తరలించారు. మృతుడికి సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉండొచ్చని, లేత పసుపు రంగు ఫుల్ షర్టు ధరించి ఉన్నాడని, నడుముకు ఎర్రటి మొలతాడు ఉందని పోలీసులు తెలిపారు. ఒంటిపై ఎలాంటి గాయాలు లేవు. మృతుడి ఆధారాలు ఏమీ లభించకపోవడంతో పోలీసులు విచారణ జరుపుతున్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు ఒకటో పట్టణ పోలీసులకు సమాచారమివ్వాలని సీఐ రామయ్య నాయుడు విజ్ఞప్తి చేశారు.

### హామీలను అమలు చేయాలి

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం స్థానిక కార్మిక, కర్షక భవన్‌లో ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ కార్మికులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 25,500 మంది కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

**సీఐటీయూలో చేరిక**

ఆత్మకూరు, డోన్, ఎమ్మిగనూరు, గూడూరు, ఆదోనిలో పనిచేస్తున్న కొందరు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు శుక్రవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు సమక్షంలో ఆ యూనియన్‌లో చేరారు.

### గ్లకోమాపై అవగాహన ఉండాలి

కర్నూలు(హాస్పిటల్): కంటిచూపును పోగొట్టే గ్లకోమా వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీనియర్ కంటి వైద్యులు డాక్టర్ పి.సుధాకర్‌రావు చెప్పారు. గ్లకోమా వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక బుధవార పేటలోని సుశీల నేత్రాలయలో పారామెడికల్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.సుధాకర్‌రావు మాట్లాడుతూ 40 ఏళ్లు పైబడి వారు తరచూ అద్దాలు మార్చాల్సి రావడం, మసక వెలుతురులో వస్తువులను గుర్తించడం ఆలస్యం అవడం, క్షేత్రదృష్టిని క్రమేణా కోల్పోవడం, కంటి ఎరుపు, నీళ్లు కారడం, కంటినొప్పి, దృష్టి మందగించడం, వాంతులు, లైట్ల చుట్టూ రంగుల వలయాలు వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ముఖ్యంగా కళ్లకు దెబ్బలు తగిలినవారు, హ్రస్వదృష్టి కలిగిన వారు, స్టెరాయిడ్స్ మందులు వాడే వారు, మధుమేహం, బీపీ ఉన్న వారు, కుటుంబంలో ఎవరికైనా గ్లకోమా ఉన్న వారు ముందుజాగ్రత్తగా పరీక్షలు చేయించుకుంటూ ఉండాలని సూచించారు. ఈ వ్యాధిని తొలి దశలో గుర్తిస్తే చూపు పోకుండా కాపాడుకోవచ్చన్నారు డాక్టర్ సావిత్రి, డాక్టర్ నేహా పాల్గొన్నారు.

### ట్రేడ్ లైసెన్సు బకాయిలపై కొరడా

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో వ్యాపారాలు చేసుకొంటూ ట్రేడ్ లైసెన్సులు చెల్లించని వారిపై శుక్రవారం పారిశుద్ధ్య అధికారులు, సిబ్బంది కొరడా ఝుళిపించారు. స్థానికంగా కొత్త బస్టాండ్ ప్రాంగణంలో మొండి బకాయిలు, ట్రేడ్ లైసెన్సులు చెల్లించని షాపుల వద్ద మున్సిపల్ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. పన్నులు చెల్లించాలంటూ శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. మొండి బకాయిలు ఉన్న షాపులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి నెలాఖరులోపు ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున షాపుల యజమానులు బకాయిలు చెల్లించాలన్నారు. లేని పక్షంలో షాపులను సీజ్ చేయడంతో పాటు వారి ట్రేడ్ లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. పారిశుద్ధ్య తనిఖీదారుడు యువరాజ్ పాల్గొన్నారు.

### ఎస్సీ వర్గీకరణ ఒక బూటకం

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో షెడ్యూల్డు కులాల వర్గీకరణ ఒక బూటకమని మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాల సంఘాల జేఏసీ చైర్మన్ కాసారపు వెంకటేష్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా యూనిట్‌గా వర్గీకరణ ఎలా సాధ్యమవుతుందో కూటమి ప్రభుత్వంలోని నేతలు చెప్పాలన్నారు. వర్గీకరణకు సంబంధించి మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటులో ఎస్సీ, ఎస్టీలు కానివారికి చోటు కల్పించడం శోచనీయమన్నారు. దళిత కాలనీల్లో ఉన్న సమస్యలు దళితులకు మాత్రమే తెలుస్తాయని, మిగిలిన కులాల వారికి ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో మాలలు, ఉపకులాలు 12 శాతం పైనే ఉన్నారని, ప్రతి కులానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. కూటమి ప్రభుత్వం మాలలను అణచివేసేందుకు దుర్మార్గమైన ప్రక్రియను ప్రారంభించిందని మండిపడ్డారు. మాలల ఓపికను పరీక్షిస్తే రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. అఖిల భారత మాల సంఘాల ముఖ్య నాయకులు రాహుల్, కిరణ్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

### 22న ఉగాది మహోత్సవ సమావేశం

కర్నూలు కల్చరల్: విజ్ఞాన సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ సాయంత్రం 5 గంటలకు బీక్యాంప్‌లోని టీజీ లక్ష్మీ వేంకటేశ్వర కల్యాణ మండపంలో ఉగాది మహోత్సవ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు ఆరోగ్య భారతి ఆంధ్ర ప్రాంత కార్యదర్శి డాక్టర్ ఎండీవీఎస్ రామశర్మ తెలిపారు. విశ్వావసు నామ సంవత్సరం తెలుగు కాలమాన పట్టిక ఆవిష్కరణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రధాన ఉపన్యాసకులుగా పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు హాజరు కానున్నట్లు తెలిపారు. క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, టీటీడీ బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, శ్రీశైలం అఖిల భారతీయ కరివేన నిత్యాన్నదాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ ఎన్.వేణుగోపాల్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు వెల్లడించారు.

## జీటీఎస్ ప్లాంట్‌ను పూర్తి చేయాలి



జీటీఎస్ ప్లాంట్ స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): జొహరాపురం డంప్ యార్డులో నిర్మిస్తున్న చెత్తా రవాణా వ్యవస్థ ప్లాంట్‌ను జూన్ నెలాఖరులోపు పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం జీటీఎస్ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. నగరంలో ప్రతిరోజు నివాస గృహాలు, వాణిజ్య దుకాణాల నుంచి వాహనాల ద్వారా టన్నుల కొద్ది వ్యర్థాలను సేకరించి గార్గేయపురం డంప్ యార్డుకు తరలిస్తున్నట్లు చెప్పారు. దీని వల్ల కార్పొరేషన్‌పై అదనపు భారంతో పాటు జాప్యం జరుగుతోందన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు జీటీఎస్ ప్లాంట్ వల్ల చెత్తను ఇక్కడే డంప్ చేస్తున్నట్లు చెప్పారు. కంప్రెస్ చేసిన తరువాత గార్గేయపురం డంప్ యార్డుకు చెత్తను తరలిస్తారన్నారు. ఫలితంగా 60 కిపైగా వాహనాల ఇంధన ఖర్చు మిగిలి ప్రజాధనం ఆదా అవుతుందన్నారు. దాదాపు 300 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్‌కు రూ.5 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు.

**పారిశుద్ధ్య పనుల తనిఖీ**

నగరపాలక సంస్థ పరిధిలో శుక్రవారం తెల్లవారు జామున కొత్తబస్టాండ్, బళ్లారి చౌరస్తా, ఏ.క్యాంపు, బిర్లా కాంపౌండ్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, డీఈఈ గంగాధర్, పారిశుద్ధ్య పర్యవేక్షణ అధికారి నాగరాజు, తనిఖీ దారులు మల్లికార్జున, ఆంజనేయులు గౌడ్, అనిల్ పాల్గొన్నారు.



కిసాన్‌ఘాట్‌లో యువత సంబరాలు

## హోలీ.. ఆనందాల కేళి



రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

కర్నూలు కల్చరల్: హోలీ వేడుకల సంబరాలు అంబరాన్నంటాయి. ఫాల్గుణ పౌర్ణమి పురస్కరించుకొని శుక్రవారం జిల్లావ్యాప్తంగా హోలీ వేడుకలు ఉత్సాహంగా ఉల్లాసంగా జరిగాయి. యువతీ యువకుల ఆనందోత్సాహాల మధ్య 'హోలీ'ని జాలీగా జరుపుకున్నారు. కుల మతాలకు అతీతంగా స్నేహ భావనను పెంపొందించే ఈ వసంతోత్సవాన్ని చిన్నారులు, యువత వైభవంగా జరుపుకున్నారు. కర్నూలు నగరంలో పలు ప్రైవేట్ ఈవెంట్ ఆర్గనైజర్స్ ప్రత్యేకంగా సెట్టింగ్స్ ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉల్లాసంగా గడిపారు. ఆటపాటలతో సందడి చేశారు. కర్నూలు నగరంలో స్థిరపడిన బంజారాలు, లంబాడీలు, గుజరాతీలు, రాజస్థానీలు ప్రత్యేక పూజలు జరుపుకొని ఇంటిల్లిపాది సంతోషంగా గడిపారు. విద్యా సంస్థలు, ప్రైవేట్ సంస్థలు, వివిధ సంఘాలు, ఆలయాల్లో హోలీ వేడుకలను జరుపుకున్నారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వీహెచ్‌పీ రాష్ట్ర, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### గుంతలు బాబోయ్ !



కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంతలు

కర్నూలు –గుంటూరు రహదారిలో వాహనదారులను గుంతలు భయపెడుతున్నాయి. ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడాల్సిందే. గార్గేయపురం గ్రామ సమీపంలోని జీరుబండలు వద్ద రహదారిపై అడుగు మేర గుంతలు పడ్డాయి. నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారిపై వెళ్తున్నాయి. అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. – కర్నూలు(రూరల్)

## వైభవంగా వేణుగోపాల స్వామి రథోత్సవం



వేణుగోపాల స్వామి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కర్నూలు(రూరల్): నందనపల్లె గ్రామ సమీపంలో వెలసిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి రథోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారి కల్యాణోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. యాగశాలలో హోమం, బలిహరణ పూజలు చేపట్టారు. అనంతరం పుష్పాలతో అలంకరించిన రథంపై స్వామి, అమ్మవార్లను ఉంచి మేళతాళాల నడుమ స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

## యాపర్లపాడు గ్రామానికి రోడ్డు నిర్మించండి

కల్లూరు: యాపర్లపాడు గ్రామానికి రోడ్డు నిర్మించాలని సీపీఎం నాయకులు మధు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం నాయకులు గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ గ్రామంలో 500 కుటుంబాలు సుమారుగా 1500 వరకు జనాభా నివసిస్తున్నారన్నారు. ఉలిందకొండ నుంచి నాలుగు కిలో మీటర్లు ఉన్న గ్రామానికి చేరుకోవాలంటే సుమారుగా 30 నిమిషాల సమయం పడుతుందన్నారు. రోడ్డు మొత్తం గుంతలమయంగా మారిందన్నారు. కార్యక్రమంలో రాముడు, శ్యామ్‌సన్, శివశంకర్‌రెడ్డి, గుర్నాథ్‌రెడ్డి, వెంకటేశ్వరమ్మ, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.